

# కథలోంచి కథ

## -కె.వరలక్ష్మి



(ప్రారంభం)

**'పాప' కథ గురించి.**

నా చిన్నప్పుడు మా ఇంట్లో వీర్రాజు అనే అబ్బాయి పనిచేస్తూ ఉండేవాడు. అతని తల్లి అతన్ని తన తల్లిదండ్రుల దగ్గర వదిలి మళ్ళీ పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయిందట. మా ఇంటి ఎదుట మాలపల్లెలోని జల్లివీరన్న మనవడు అతను. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. మా అమ్మానాన్నల్ని అమ్మ - నాన్న అని, నన్ను చెల్లెమ్మ అని పిలిచేవాడు. నేను బళ్ళో నేర్చుకున్న చదువు ఇంటికొచ్చి అతనికి నేర్పిస్తూ ఉండేదాన్ని. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండేవాడు. మా అమ్మ పప్పుచారుతో అన్నంపెట్టిన రోజు "సిన్న ఎండు సేపముక్క కాల్చియ్యమ్మా" అని అడిగేవాడు, వాళ్ళమ్మంటే అసలు ఇష్టపడేవాడు కాదు.

నా పెళ్ళై నేను మా అత్తవారింటికి వెళ్ళాక బాబ్జీ అనే మరో కుర్రాడు మా ధాన్యం మిల్లులో పనిచేసేవాడు. నన్ను 'అక్కా' అని పిలిచేవాడు. పది పన్నెండేళ్ళ వయసున్న వాడిని అందరూ దొంగ అని చెప్పుకునేవారు. వీడినీ పుట్టగానే తల్లి వదిలేస్తే మరెవరో పెంచుతున్నారు, ఎవరిమాటా లెక్కచేయనివాడు నేనేం చెప్పినా వినేవాడు. నా మాటకోసం దొంగతనాలు మానేసాడు. వాళ్ళిద్దరి గురించీ కథ రాయలని అనిపించేది. 'ఎలా మొదలు పెట్టాలి?' అనుకుంటున్నప్పుడోసారి నేను ప్రయాణిస్తున్న పాసింజరు రైలు కొవ్వూరు స్టేషన్లో చాలాసేపు ఆగిపోయింది. ఈ కథలోని స్టేషను దృశ్యమంతా అక్కడ జరిగిందే పాప ఒక్కతే నా కల్పన.

శ్రీ కొంగర జగ్గయ్యగారు, ఉప్పల నరసింహంగారు కథావేదిక తెస్తున్న రోజులవి. ఈ కథను కథావేదికలో ప్రచురించారు. తర్వాత ఎప్పుడో 'విపుల'లో 'నాకు నచ్చిన కథ' శీర్షికలో జగ్గయ్యగారు ఈ కథ తనకు నచ్చిన కథ అని ప్రస్తావించారు. ఆంధ్రప్రభ డైలీలో ఈ కథను మాగ్నమ్ ఓపస్ అంటూ యాళ్ళ అచ్యుతరామయ్యగారు నన్ను ఇంటర్వ్యూ చేసారు.

కథా రచనలో శ్రీ కాళీపట్నం రామారావు మాస్టారు నాకు ఆదర్శం. అట్టడుగు వర్గాల జీవితాల మీద కథలు రావాలని నేను కోరుకుంటాను. ఆ జీవితాల్ని దగ్గరనుంచి పరిశీలించి రాయడం వలన ఈ కథ అందరికీ నచ్చిందని నా అభిప్రాయం. బాలిగాడి కేరెక్టరుకి మూలమైన ఇద్దరూ చిత్రంగా మంచి గాయకులు. వీర్రాజైతే తర్వాతికాలంలో ప్రసిద్ధ నటుల సరసన నక్షత్రకుడు, నారదుడు వంటి పాత్రలకి పెట్టింది పేరనిపించుకుని దేశం మొత్తం పర్యటించాడు, తర్వాతి రోజుల్లో తాగుడు అతన్ని మింగేసింది. ఏ మనిషినీ ఒకే కోణంలోంచి చూడకూడదనీ, మనిషి నడవడికలో బహుముఖాలుంటాయనీ చెప్పిన నా ఈకథ నాకిష్టమైన కథ. పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఏమాత్రం పాలుమాలకూడదని గ్రహించాలని ఈ కథ ముగింపు అలా చేసాను.

# పాప

**సూర్యబింబం** పశ్చిమాద్రి వెనక దిగడానికి సన్నద్ధమౌతోంది. ఆకాశం సింధూరపు రంగు పైట చెంగును ఆరబెట్టుకుంటోంది. తూర్పున అప్పుడే మొదటి చుక్క మెరవబోతోంది.

మోకాలి మీద ముందుకి వంగి చితుకులు పొయ్యిలోకి ఎగదోసాడు బాలిగాడు. వెదురు గొట్టంతో బుగ్గలనిండా గాలి పూరించి పొయ్యిలోకి ఊదుతున్నాడు. తడిసిన చితుకులు రాజుకోడానికి ఎదురు తిరుగుతున్నాయి. తెల్లని పొగమాత్రం బాలిగాడి కళ్ళల్లో నిండిపోయి నీళ్ళు తెప్పిస్తోంది. ఊది ఊది అలిసిపోయి నేలమీద చతికిలపడ్డాడు.

"దీనమ్మా సిగ్గోసిరి. ఎదవ సితుకులు తడిసిపోనాయెహె" అని తిట్టుకున్నాడు.

"ఒరి బాలిగా! సుట్టకాల్సుకోటానికి సిన్న నిప్పెట్రా" టాయ్‌లెట్స్ పక్కనుంచి గుడ్డి ఈరిగాడు ఓ కేక పెట్టాడు.

"ఛెయ్, ఉండెహె, ఇదంటుకోక నాను సత్తా ఉంటే, రాజాగోరికి నిప్పుగావాలంట" విసుగంతా గొంతులో చూపించాడు బాలిగాడు.

దూరంగా ఫ్లాట్ ఫారం విపరీతమైన సందడిగా ఉంది. స్టేషన్లో ట్రైన్ ఆగి ఉంది. దిగినవాళ్ళూ, ఎక్కేవాళ్ళూ సామాన్లు సరిపోయాయో లేదో చూసుకుని మర్చిపోయిన వాటికోసం బండిలోపలికి, బైటికి పరుగులెత్తుతున్నారు. ఆ స్టేషన్ చిన్నది. అక్కడ ఏ బండీ ఎక్కువసేపు ఆగదు.

బండి ఆగిన వెంటనే బాలిగాడు పరుగెత్తుకెళ్ళి కిటికీల దగ్గర అడుక్కోవడం ఓ రౌండు పూర్తిచేసి వచ్చాడు. ఈలోగా పొయ్యి కాస్తా ఆరిపోయి ఊరుకుంది. కుండ మీది మూత తీసి చూసాడు. అడుగున నూకలు, పైన నీళ్ళూ కదలా మెదలకుండా ఉన్నాయ్. పొద్దున తాగిన టీ నీళ్ళు తప్ప ఆ రోజంతా కడుపులో ఏం పడలేదు. వాడి కడుపులో ఆకలి మండుతోంది.

చట్టి కింద పొయ్యి మండడంలేదు. పొయ్యి మండేదెపుడూ.. గంజి తాగేదెప్పుడు?

చుట్టూ చూపుల్ని పరుగెత్తించాడు. పారేసిన కాయితాలేవైనా దొరుకుతాయేమోనని. దరిదాపుల్లో ఎక్కడా కనిపించలేదు.

"ఏ కాయతంమ్ముక్క అయినా పడ్డం బయ్యం, తుడిసి సెత్తకుండీలో పాడేత్తారు ఎదవనాకొడుకులు"

స్వీపర్లని తిట్టుకుంటూ లేచి చెత్తకుండీ వేపు నడిచాడు. కుడిచేతి గుప్పిటి నిండా చిత్తుకాయితాలు బిగించి పట్టుకుని పొయ్యిదగ్గర కొచ్చాడు. అంతకు ముందే కురిసిన సన్నటి జల్లుకి ఆ కాయితాలు కూడా తడిసిపోయున్నాయి.

పొయ్యిలోంచి వస్తున్న పొగమీద కాయితాల్ని కూరి, మళ్ళీ ఊదడానికి లంకించుకున్నాడు. ఈసారి అగ్గికి వాడిమీద జాలేసినట్టుంది. రప్పుమని మండింది పొయ్యి. పొయ్యి వెలగడం చూసి బాలిగాడి మొహం వెలిగిపోయింది. "అమ్మయ్య ఇంకేం పర్లేదు. ఐదునిముసాల్లో గంజి కాసేత్తాను" అనుకున్నాడు.

"బాలిగా, నిప్పు" మళ్ళీ అరిచాడు ఈరిగాడు.

"ఈడొక్కడ్రా బావూ నా పేనానికి, పొయ్యేలిగించిన కాణ్ణుంచి అత్తమాటూ నిప్పు నిప్పని సంపేత్తాడు" గొణుక్కుంటూ చిన్న చితుకొకటి పట్టుకెళ్ళి ఈరిగాడి చుట్టముట్టించి వచ్చాడు.

"నా బాబే, నా బాబే, సేనా మంచోడివిరా బాలిగా" అని మెచ్చుకున్నాడు ఈరిగాడు. పొద్దున్నే సుట్టముక్కకి పదిపైసలు అప్పివ్వలేదని ఈరిగాడు బండబూతులు తిట్టడం గుర్తొచ్చి, "ఎదవ, ఏలపట్టుని ప్లేటు మార్చేత్తాడు" అనుకున్నాడు.

బాలిగాడికి ఊహ తెలిసినప్పట్నుంచీ ఆ ఫ్లాటుఫారమే ఇల్లూ వాకిలీ. ఆ ఊరే అమ్మానాన్నా. ఆకలి వాడికి కష్టపడ్డం తప్ప అన్నిరకాల విద్యలు నేర్పింది. చిన్నపిల్లాడిగా ఉన్నప్పుడు 'పోనీలే చిన్నోడు' అని జాలిపడి అన్నం పెట్టిన వాళ్ళంతా పెరిగి పెద్దవాడయ్యాక కూడా వాడదే వృత్తిని అనుసరించబోతే ఈసడించుకున్నారు. కొంతమంది మంచిగా పిలిచి కష్టపడి కడుపుకింత సంపాదించుకోవడం గౌరవప్రదం అని బోధించి చూసారు. ఆ బోధలేవీ వాడి చెవికెక్కలేదు. ఒకటి రెండుసార్లు ప్రయత్నం చేసి చూసారు. వాడికి హఠాత్తుగా చెముడొచ్చింది. అంటే నిజంగా వచ్చిందనికాదు. చెవిటి తనం చూడగానే కనిపించేదికాదు కాబట్టి కుంటితనాన్ని కొని తెచ్చుకోవాలని చూసాడు. సొంత శరీరాన్ని సొంతంగా హింసించుకోవడం వాడి తరం కాలేదు. అందుకని రోజూ ఉదయం లేవగానే ఎడం కాలి పాదానికి ఓ మూటెడు పాత గుడ్డల్తో బేండేజి కడతాడు. అక్కడక్కడ ఎర్రరంగు పులుముతాడు. చేతిలో ఒక డబ్బాతో కుంటుకుంటూ బయలుదేరతాడు. స్టేషన్లో వచ్చే డబ్బుల్తో బీడీలు, ఇడ్లీలు, టీలూ కొనుక్కుంటాడు. అన్నం తినాలనో, గంజి తాగాలనో అనిపించిన రోజు ఊళ్ళోకి పోయి నూకలు అడుక్కుని తెచ్చుకుంటాడు. మరీ నిర్లక్ష్యంగా ఉన్న ప్రయాణీకులు కనిపించినప్పుడు మాత్రం సంశయించకుండా పిక్‌పాకెటింగ్ చేసేస్తాడు. అదృష్టం బాగుండి కొట్టేసిన పర్స్‌లో డబ్బులెక్కువే ఉంటే రోజులపాటు అడుక్కోవడం మానేసి బిస్కెట్లు, బిర్యానీల మీద బండి లాగించేస్తాడు.

స్టేషన్లో బండి కూతవేసి బయలు దేరింది. ఒక్కసారిగా సందడంతా సద్దుమణిగిపోయింది. ఆ స్టేషన్లో ఆగే ఆఖరు బండి అదే

పొయ్యికింద చితుకుల్ని ముందుకి తోసాడు బాలిగాడు. మంట కుండ అంచుల్ని తాకింది. ఒక్కసారిగా మూతను పైకి లేపేస్తూ గంజి పొంగింది. పైమీది తువాలు గుడ్డతో మూతను తీసి పక్కన పెట్టి చెక్కపేడుతో గంజిని కలియబెట్టాడు. జేబులోంచి ఉప్పు పొట్లం తీసి చారెడు ఉప్పు గంజిలో వేసాడు. కుండ కిందికి దింపి, పక్కనే ఉన్న ప్లాస్టిక్ చెంబులోని నీళ్ళు కొద్దిగా మంట మీద చిలకరించాడు. మంట ఆరిపోయి నిప్పులు మిగిలాయి.

నిక్కరు జేబు వెతుక్కుని కాయితంలో చుట్టి ఉన్న ఉప్పు చేపముక్కని అపురూపంగా బైటికి తీసాడు. చెమ్మకి దానికంటుకుపోయిన కాయితాన్ని పూర్తిగా విప్పకుండానే ఆ ముక్కని నిప్పుల్లో పడేసాడు. కర్రపుల్లతో దాన్ని అటూ ఇటూ తిప్పుతూ కూర్చున్నాడు. స్టేషన్ పరిసరాలన్నీ ఎండు చేపకాల్తున్న వాసనతో నిండిపోయాయి. ఆ వాసనకి బాలిగాడికి నోట్లో నీళ్ళూరి పోతున్నాయి. ఎప్పుడెప్పుడు గంజి చల్లారుతుందా, ఉప్పుచేప నంజుకుని తాగుదామా అనిపిస్తోంది. రోజూ ఉప్పుచేప కొనుక్కునే అవకాశంరాదు. ఎండు సందువా ముక్క రూపాయి పెడితే గానిరాదు. సాధారణంగా బాలిగాడికి గంజిలో నంజుకు పచ్చిమిరపకాయే. అప్పుడప్పుడూ ఇలా అదృష్టం కలిసొచ్చినరోజు ఉప్పుచేప.

"ఉప్పుసేప కాలుత్తున్నావేట్రా బాలిగా?" ముక్కు పుటాలెగబీలుస్తూ ఈరిగాడు అడిగాడు.

"నువ్వు తినేసాక సిన్నముల్లు మిగిల్తే నాకియ్యరా" నోట్లో ఊరుతున్న నీళ్ళని గుటకేస్తూ అన్నాడు.

బాలిగాడికి అర్జంటుగా చెవుడొచ్చింది. "అడుక్కున్న డబ్బులన్నీ బొడ్డుకాడ ముడివేసి, అందర్నీ దేబిరించుకు బతికేత్తాడు దొంగనాకొడుకు" నోట్లోనే తిట్టుకున్నాడు బాలిగాడు.

ఆసరికి పూర్తిగా చీకటి పడింది. టాయ్‌లెట్స్ దగ్గరున్న లైటు ఈరిగాడి మీద పూర్తిగానూ, బాలిగాడి మీద పాక్షికంగానూ పడుతోంది.

"గుడ్డోడికి కనపడతాదేట్లే" అనుకుని రెండు కాళ్ళూ బారచాపుకుని, మధ్యలో గంజికుండ పెట్టుకుని, ఎడం చేత్తో ఉప్పుచేప పట్టుకుని ఆత్రతగా తినడానికి సిద్ధమయ్యాడు బాలిగాడు. ఓ కన్ను ముసలాడి మీద వేసే ఉంచాడు. గంజితాగే చప్పుడుకి చప్పుళ్ళేకుండా వెనకనుంచి ఒచ్చేసి "కూసింత గెంజి నీల్లియ్యరా బాలిగా" అని కూడా అడిగేస్తాడేమోనని.

కుండ అడుగునున్న మెతుకుల్ని నాలుగు గుక్కలు తిన్నాడో లేదో ఎడంగా పెట్టిన పాదాల మధ్య అడుగెత్తు ఆకారం,ఒకటి నిలబడినట్టె తలపైకెత్తాడు, ఉలిక్కిపడి తాగుతున్న గంజి కొరబోయింది.

రబ్బరు బొమ్మలాంటి పాపాయి వచ్చి తన పాల సందున నిల్చుంది. కలో నిజమో అర్ధంకాలేదు. తేల్చుకోడానికి కాలితో తాకి చూసాడు. నిజంగానే పిల్ల. పడీపడని వెలుతుర్లో కూడా ఆ పిల్ల ఒంటి రంగు మెరిసిపోతోంది. పట్టుగౌను కాబోలు పిల్ల రంగుతో పోటీ పడుతోంది. మెళ్ళో గొలుసు, చేతులకి రెండేసి బుల్లి బుల్లి గాజులు, చెవులకి జూకాలు, నాలుగు ఉంగరాలు "ఇంతవరకూ రైలు కోసం స్టేషన్లో కూచున్న పెళ్ళివోళ్ళ తాలూకు అయి ఉంటాదీ పిల్ల. రైలెక్కే సందట్లో వదిలేసి పోయుంటారు" అనుకున్నాడు బాలిగాడు.

అనాలోచితంగా చుట్టూ పరికించాడు ఆ పిల్ల తాలుకా వాళ్ళెవరైనా ఉన్నారేమోనని. అవతల ఈరిగాడూ, ఇవతల తనూ తప్ప పిట్ట మనిషి లేరక్కడ, స్టేషన్లో కూడా అలికిడేం లేదు. బైటికి పోవాల్సినోళ్ళంతా ఎప్పుడో వెళ్ళిపోయారు. స్టేషను మేష్టారి గదిలో మాత్రం లైటు వెలుగుతూంది.

బాలిగాడికి తన గుండె చప్పుడు తనకే స్పష్టంగా వినబడుతోంది. వెళ్ళిపోయిన రైలు వెనక్కొచ్చి తన గుండెల్లో పరుగు తీస్తోందా అనిపిస్తోంది. అంత ఆకలీ ఏమైందో తెలీదు. గంజి గొంతు దిగడం మానేసింది. ఉప్పుచేప రుచి మారిపోయింది. ఎలాగో గొంతు పెకిలించుకుని మెల్లగా అడిగాడు" నీ పేరేంటి పాపగోరూ?" పాప ఒంటి మీదున్న బంగారం వాణ్ణి బహువచనానికి పురికొల్పింది.

"అమ్మ" అంది పాప.

"నీపేరు.. పేరు.." అన్నాడు వాడు.

"అమ్మ" అంది పాప మళ్ళీ

"ఇదేం గోలెహెయ్, అమ్మ అమ్మంటాది. మాట్లలావు గామోసు" అనుకున్నాడు. చేతిలో చేపముక్కని చూపించి "తింటావా?" అన్నాడు.

పాప తల అడ్డంగా ఊపింది. ఎంగిలి చేత్తో నెత్తిమీదొకటి కొట్టుకున్నాడు. "ఇలాంటి కలిగినింటి పిల్లలు బిస్కత్తులు తింటారుగానీ, ఉప్పుసేపలు తింటార్రేటా ఎదవా" అని తనని తనే తిట్టుకున్నాడు.

ఓక్షణం ఏం చెయ్యాలో పాలుపోలేదు. ముందు ముఖ్యంగా పాప ఒంటి మీదున్న బంగారాన్ని కాళీ చేసెయ్యాలి.

రెండు కాళ్ళూ జాగ్రత్తగా దగ్గరికి లాక్కుని, గంజిముంతనీ, ఉప్పుచేపనీ పట్టుకెళ్ళి ఈరిగాడి కిచ్చేసి వాడేదో అడుగుతున్నా విన్పించుకోకుండా ఉరుక్కుంటూ వచ్చేసాడు. కుంటికాలి మాటే మర్చిపోయాడు.

గబగబా పాప నగలన్నీ తీసేసి జేబులో వేసుకున్నాడు. జూకాలు మాత్రం రాలేదు. రింగుతో చెవికి చుట్టేసి ఉన్నాయి. తెంపేద్దామా అనుకున్నాడు. అలా చేస్తే పిల్ల ఏడుస్తుందనీ, ఆ ఏడుపు విని స్టేషను మేష్టరు బైటికి రావచ్చనీ స్ఫురించింది వాడికి "పోన్లే దొరికిన కాడికే ప్రాప్తం. ఈరోజు లెగ్గానే ఎవరిదో బంగారు మొకం సూడబట్టి ఇంతదురుష్టం కలిసొచ్చింది. ఎప్పుడున్నా కల్లోకన్నా వచ్చిందా ఇంత బంగారం? అమ్మితే ఎంతొత్తాదో కానీ, మొత్తం మీద బంగారానికి మాత్రం సాలా రేటుంటాదంట. తల్లి మాలచ్చిమి కలిసొచ్చిన కాలానికి నడిసొచ్చీసినాది" అనుకున్నాడు.

పాతగుడ్డల సంచిని భుజానికి తగిలించుకున్నాడు. స్టేషన్ గేట్లోంచి వెళ్ళడానికి ధైర్యం చాల్లేదు. పట్టాల వెంబడే వీలైనంత దూరం పోవాలని, తిరిగి కొన్నాళ్ళ వరకూ ఈ దరిదాపులకి రాకూడదనీ నిశ్చయించుకున్నాడు. వాతావరణం చల్లగా ఉన్నా చెమటలు దిగకారుతున్నాయి వాడికి. ఓ ఇరవై అడుగులు వేసాక ఏదో అనుమానం వచ్చి వెనక్కెళ్ళి పాప ముందు మోకాళ్ళ మీద కూర్చుని "ఓయ్, ఏటిలాగొచ్చేతన్నావ్, ముందుకెల్లీ కొద్ది సిమ్మసీకటి. జడుసుకుంటావు టేషన్లో కెల్లిపో మేష్టరుగారు మీ యమ్మకీ నాన్నకీ అప్పగించేత్తారు, ఎల్లెల్లు" అన్నాడు. పాపకేం అర్ధమైందో తెలీదుకానీ, నవ్వింది. రెండు చేతులూ వాడి భుజాలమీద వేసి ఎత్తుకోమన్నట్టు చూసింది.

ఆ స్పర్శకీ, ఆ చూపుకీ బాలిగాడి మనసు మారుమూలల్లో ఏదో కదిలింది. ఒక్క ఉదుటున పాపాయిని పైకిలేపి ఎత్తుకున్నాడు. పాప వాడి మెడచుట్టూ చేతులు వేసి, విశ్రాంతిగా వాడి భుజం మీద తల వాల్చింది. చంటిపిల్ల స్పర్శ అంత హాయిగా ఉంటుందని వాడికా క్షణం వరకూ తెలీదు. ఈ పిల్లని పెంచుకుంటేనో అనిపించిందో క్షణం.

వాడికి మతిపోయింది. తన దగ్గర ఈ పిల్లని చూసిన వాళ్ళెవరికైనా అనుమానం వెంటనే వస్తుంది. పోయి పోయి జైల్లో కూచోవాలి. నడుస్తూనే ఆలోచిస్తున్నాడు పిల్లనెలా వదుల్చుకోవాలా అని. వాడి ఆలోచన తెలిసిన దాన్లా పాపాయి చేతులు మరింత బిగించింది.

"పిల్లల్ని కొనుక్కునే ఓళ్ళుంటారంట, ఆళ్ళెక్కడుంటారో తెలిత్తే బాగుణ్ణు, వందో ఎయ్యో డబ్బులు కల్లజాద్దును" అనుకున్నాడు. "ఎయ్యిరూపాయలంటే ఒక గోనిసంచి నిండిపోవచ్చు" అని కూడా అనుకున్నాడు. ఆ మాత్రం ఊహకే వాడికి గిలిగింత అనిపించింది. ఎంత ఆలోచించినా వాడి ఊహకి అందలేదు పిల్లల్ని కొనుక్కునే వాళ్ళెక్కడుంటారో.

ఇలాంటి విషయాలన్నీ కల్లుపాక రావులమ్మకి బాగా తెలుస్తాయి. కానీ, ఈవేళప్పుడెళ్తే అక్కడందరూ తాగుబోతెదవలుంటారు. తనకీ రావులమ్మకీ తప్ప మూడో కంటికి తెలియకుండా వ్యవహారం ముగిసిపోవాల. అప్పటికప్పుడొక నిర్ణయానికి వచ్చాడు.

పట్టాల వెంబడే కొంతదూరం నడిచి కుడిపక్క డొంకలోకి తిరిగితే దూరంగా పడిపోయిన పాత కొంపొకటుంది. ఈ రాత్రికందులో తలదాచుకుని పొద్దున్నే రావులమ్మని కలవాలనుకున్నాడు.

పాపాయి నిద్రపోయిన గుర్తుగా వాడి భుజం మీద తల వాల్చేసింది. అలవాటులేని వ్యవహారం, చంటి పిల్లనెత్తుకుని నడవడం కష్టంగా ఉంది. చెయ్యి, నడ్డికూడా నొప్పెడుతున్నాయ్, పాడుపడ్డ సత్రం ముందుకి చేరేసరికి ఆయాసం వచ్చింది బాలిగాడికి.

తలెత్తి ఆ ఇంటిని చూసేసరికి భయం వేసింది. పగలు చాలాసార్లే అక్కడికి వచ్చాడు. కూలిన గోడల మధ్య లేచిన పిచ్చిమొక్కలతో, గీపెడుతున్న కీచురాళ్ళతో చీకట్లో ఆ ఇల్లు జుట్టు విరబోసుకున్న పిచ్చిదాన్లా ఉంది. ముందు గది తప్ప ఇల్లంతా కూలిపోయింది.

అలవాటు ప్రకారం వాకిలి మెట్లెక్కి ముందు గదిలోకి చేరుకున్నాడు తడువుకుంటూ. పాపని నేలమీద పడుకోబెట్టి జోలెలోంచి కొవ్వొత్తి ముక్కవెతికి తీసి నేలమీద పెట్టాడు. జేబు తడువుకుని బీడీముక్క తీసి నోట్లోపెట్టుకున్నాడు. అగ్గిపుల్ల గీసి ముందు దీపం వెలిగించి, ఆ పుల్లతోనే బీడీముట్టించుకున్నాడు. నేలమీద చతికిలబడి గుండెల నిండా రెండు దమ్ముల పొగ పీల్చుకున్నాక గాని వాడికి దడ తగ్గలేదు. ఇదంతా కలకాదనడానికి నిదర్శనంగా నేలమీద పడి నిద్రపోతున్న పాపాయి ఉంది. జేబుమీద చెయ్యివేసుకున్నప్పుడల్లా చేతికి తగిలి పులకెత్తిస్తున్న నగలు ఉన్నాయి.

గాలికి దీపం రెపరెపలాడింది. చెయ్యి అడ్డం పెట్టాడు. పగలంతా అక్కడెవరో పేకాడినట్టుంది. కాల్చిపారేసిన సిగరెట్టు పీకలు, బీడీలు, తాగిపడేసిన సారాయి పేకట్లు గలీజుగా ఉంది. అలవాటు ప్రకారం వాడి చెయ్యి సిగరెట్టు పీకలు, బీడీపీకలు ఏరి జోలెలో పడేసుకుంటోంది.

పాపాయి నిద్రలో అట్నుంచిటు కదిలింది. బాలిగాడి దృష్టి పాపాయి ముఖం మీద పడింది. పాలబుగ్గ మీద దీపం వెలుగు పడి మెరుస్తోంది. పున్నమినాటి చందమామ తలుపుకొచ్చింది వాడికి. నిద్రలోనే కుడిచేతి బొటనవేలిని నోట్లో పెట్టుకుని మూతిని సున్నాలా చుట్టి జుముకుతోంది. ఆ వేలి నుంచి పాలొస్తున్నంత తృప్తిగా గుటకలు వేస్తోంది.

రెప్పవాల్చకుండా కొంతసేపు అలా చూస్తూ ఉండిపోయాడు వాడు. ఏదో ఆప్యాయత ముంచుకు రాగా పాపాయి చెంపకు అంటుకున్న ధూళిని చేత్తో నెమ్మదిగా తుడిచాడు. అలా తుడిచేముందు చేతిని చొక్కాకి రాసి రాసి తుడుచుకున్నాడు. బంగారం లాంటి

ఈ పిల్లని కొనుక్కున్నోళ్ళు కన్నో కాలో తీసేసి అడుక్కోడానికి సిద్ధం చేస్తారు కాబోలు. వెన్నులోంచి చలిపుట్టింది వాడికి. "అమ్మా.." అంది పాపాయి నిద్రలో వేలుతియ్యకుండానే.

ఒళ్ళు మండిపోయింది బాలిగాడికి అసలా 'అమ్మ' అనే మాటంటేనే అసహ్యం వాడికి. ఇంతందమైన పాపాయిని స్టేషన్లో వదిలేసి రైలెక్కిపోయిన ఆ తల్లికి అమ్మ మనసుండి ఉండదని వాడి ఉద్దేశం. తన తల్లి మాత్రం.. ఎక్కడో కనేసి, మరెక్కడో పడేసిపోయింది. ఆ మహాతల్లి అలా వదిలేసి పోయేసరికి బహుశా తనింత ఉండిఉంటాడేమో. 'అసలు ఆడజాతే నమ్మరాని జాతి' అంటాడు ఈరిగాడు. ఈ మాట నిజం.

హఠాత్తుగా లేచి పాప ఏడుపు లంకించుకుంది. అటూ ఇటూ దొర్లుతూ కాళ్ళు తన్నుకుంటోంది. పరికించి చూస్తే నేలమీదంతా చీమల బారులు, ఆత్రుతగా పాపాయిని ఒళ్ళోకి తీసుకున్నాడు. గుక్కపట్టి ఏడుస్తోంది పాపాయి. ఏం చెయ్యాలో అర్థంకాలేదు వాడికి. హఠాత్తుగా గుర్తుకొచ్చింది సాయంకాలం నుంచి ఏం తినలేదని.

"ఎలాగిప్పుడు? వచ్చేటప్పుడు ఒక బన్నైనా కొనుక్కొచ్చానుకాదు ఎర్రెదవని" అని తనని తనే తిట్టుకున్నాడు.

బన్ను అనుకోగానే గుర్తుకొచ్చింది. వారం క్రితం ఒకసారి బన్ను కొనుక్కుని పూర్తిగా తినకుండానే సంచిలో పడేసుకున్న విషయం. గుడ్డలమూట అడుగున దొరికింది. ఎండిపోయిన రొట్టెముక్కని గుండలా చేసి పాపాయి నోట్లో కొంచెం వేసాడు. పాపాయి ఏడుపు ఆపింది. ఆకల్తో ఉందేమో వాడు వేసే గుండని చప్పరించి మింగుతోంది. అలా నాలుగైదుసార్లు మింగేసరికి ఎక్కిళ్ళు మొదలయ్యాయి. మూలనున్న కుండలోంచి ప్లాస్టిక్ డొక్కుతో నీళ్ళు ముంచి పాపాయికి తాగించాడు బాలిగాడు. కొంచెం సేపు ఏడుపు ఆపి, గుడ్డిదీపం వెలుతుర్లో బాలిగాడి ముఖాన్నీ, పరిసరాల్నీ పరికించి చూసి మళ్ళీ ఏడుపు మొదలు పెట్టింది.

ఆ నిశీథిలో పాప ఏడుపు ప్రతిధ్వనిస్తోంది. రాత్రి గడిచిపోతోంది. బాలిగాడికి నిద్రముంచుకొస్తోంది. జేబులో ఉన్న సొమ్ములూ, పాపాయి ఏడుపూ వాడి కంటికి నిద్రని దూరం చేస్తున్నాయి.

ఆగి ఆగి పాపకి నీళ్ళు మాత్రం పడుతున్నాడు.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోయింది పాప.

తెల్లవారు ఝామునెప్పుడో వాడికి తెలీకుండానే నిద్రలోకి జారుకున్నాడు బాలిగాడు.

పడిపోయిన గోడల మీదగా సూర్యుడు తన కిరణాల కళ్ళతో తీక్షణంగా బాలిగాడిని చూస్తున్నాడు. ఒళ్ళంతా చిటపటాడినట్టై, బాలిగాడికి మెలుకువ వచ్చేసింది. అలవాటు ప్రకారం రైలుబళ్ళ కూతలూ, టీ - కాఫీల కేకలూ వినపడక పోవడంతో ఒక్క నిముషం ఎక్కడున్నాడో అర్థ కాలేదు వాడికి. నిద్రలో దూరంగా దొర్లుకుంటూ పోయిన పాపాయిని చూడగానే వాడికి జరిగినదంతా గుర్తుకొచ్చింది. అప్రయత్నంగా వాడి చెయ్యి జేబులోని నగలమీదికి పోయింది. లేచి బైటికొచ్చిచూసాడు.

పరిసరాల్లో ఎక్కడా అలికిడి లేదు. "ఇంకా నయ్యం, ఏ దేవుడో మేలు సేసి మెలుకువొచ్చేసినాది. ఇంకాసేపుంటే పేకాట మూకంతా వచ్చిపడిపోదూ" అనుకున్నాడు.

రాత్రి వాడి బుర్రలో మెదిలిన ఆలోచనా, అనుకోకుండా ఆ పిల్లమీద జాలిలాంటిదేదో కలగడం గుర్తుకొచ్చింది. రెండింట్లో ఏది మంచిదో బేరీజు వేసుకున్నాడో క్షణం. మొదటిదే లాభసాటి వ్యవహారం అనిపించింది. పిల్ల ఒంటిమీద నగలేకాక, తిరిగి ఎంతో కొంత పైకం దొరుకుతుంది. రెండో ఆలోచన ప్రకారం అనవసరంగా జాలికి పోయి పిల్లని తీసుకెళ్ళి స్టేషన్లో అప్పగిస్తే రెంటికీ చెడ్డ రేవడవుతాడు తను. రాత్రి నుంచీ పిల్లనెక్కడ దాచావని తిరిగి తంతారు కూడా.

జాలిలాంటిదేదీ తనలో కలక్కుండా ఉండటం కోసమని ఆ పిల్ల ముఖం వైపు చూడకూడదని నిశ్చయించుకుంటూండగానే వాడి మాటలు వినకుండా వాడి దృష్టి పాపాయి మీదికి పోయింది. రాత్రి చీమలు పాకి ఏడుస్తూందని ఒంటి మీది బట్టలు విప్పేయడంతో ఆ

ఉదయపు నీరెండలో పాలరాతి బొమ్మలా మెరుస్తోంది పాపాయి. ఒక చెయ్యి చెంప కింద పెట్టుకుని ఒత్తిగిలి పడుకుని ఉంది. నోట్లో పెట్టుకున్న రెండో చేతివేలు ఎప్పుడు జారిపోయిందో కానీ, కొంచెంగా తెరుచుకున్న పెదవుల మధ్య నాలుకని అర్ధ చంద్రాకారంగా చేసి ఆగి ఆగి పాలు తాగుతూన్న అనుభూతిని పొందుతోంది.

పాపాయిని అలాగే లేపి నిద్రాభంగం కలగకుండా భుజం మీద వేసుకున్నాడు. జోలెలోంచి పాతగుడ్డ ఒకటి తీసి పాపాయి మీద పూర్తిగా కప్పాడు. ఊళ్ళోంచి వెళితే మంచిదికాదని పొలాలకడ్డం పడి ఊరికి ఆ చివరనున్న రావులమ్మ కల్లుపాక వైపు నడిచాడు. కోళ్ళగూడు మీద కూర్చుని పళ్ళుతోముకుంటున్న రావులమ్మ అంత పొద్దున్నే వచ్చిన బాలిగాణ్ణి చూసి "ఏరా బాలిగా! పొద్దున్నే సుక్కేసుకోవడం కాడికొచ్చిందేంటి నీ పని?" అని పలకరించింది.

సమాధానమేం చెప్పకుండా బాలిగాడు భుజం మీంచి దించి బల్ల మీద పడుకోబెడుతున్న పాపాయిని చూస్తూ "ఒరి నీ జిమ్మడిపోనూ, ఈ పిల్లనెక్కణ్ణుంచెత్తుకొచ్చేవురా?" అని అరిచింది.

"నీకు దణ్ణం పెడతాను, అరవకండీ రావులమ్మగోరూ" బతిమాలుతున్న ధోరణిలో అన్నాడు బాలిగాడు. "ఈ పిల్ల నాకు దొరికింది. ఎవరో కూటికి పెంచలేక ఒదిలేసుంటారు" అతికినట్టు అబద్ధమాడేననుకున్నాడు.

"నోరుముయ్యెసె ఎదవా! కూటికి లేనోళ్ళు కుర్రదానికి బంగారం జుమికీలు కుట్టించేరేంట్రా? " అంది రావులమ్మ పాపాయి చెవులు పరికిస్తూ " ఇంతకీ ఈ పిల్లని ఇక్కడికెందుకు తీసుకొచ్చావ్?"

"ఎవరైనా కొనుక్కునే వోల్లుంటే అమ్మేద్దామనీ.." నసిగాడు బాలిగాడు. ఓ క్షణం పాపాయిని తదేకంగా చూసింది రావులమ్మ. నోట్లోని పందుం పుల్లని విసిరేసి, కాసిన్ని నీళ్ళు పుక్కిలించివచ్చింది.

"ఎవరో ఎందుకు, నేనే పెంచుకుంటాను, బంగారం బొమ్మలాగున్నాది పిల్ల" అంది. అంటూనే బొడ్లోంచి చిన్నపాటి సంచొకటి తీసి, దాన్లోంచి అయిదు పదులు తీసి వాడి చేతిలో పెట్టింది. వాడింకా నాన్చడం చూసి "ఏంట్రా, ఎదవా, సెప్పేడు?" అంది. "బొత్తిగా ఏభై ఇచ్చారు, సెవులికి బంగారం పోగులున్నాయిగదా.."

"ఉంటే? అయ్యేమన్నా నీ బొడ్డుకాడి సొమ్మేంట్రా" గదమాయించింది రావులమ్మ.

"సర్లే ఈ యాభై కూడా ఏడు" మరో యాభై ఇచ్చింది. పాప తాలూకు పట్టుగౌను తీసి రావులమ్మ కిచ్చాడు బాలిగాడు. రావులమ్మ కళ్ళు మెరిసాయి.

"ఇంత మంచి గుడ్డలేసేరంటే ఈ పిల్ల తప్పకుండా ఉన్నోళ్ళ పిల్లేరా బాలిగా" అంది.

"కాసింత కల్లుసుక్క.." అని కొసిరాడు బాలిగాడు.

"పొద్దున్నే ఇంకా బోణీ అవలేదు. సాయంత్రం పోత్తాన్లేరా" అంది రావులమ్మ. ఓ క్షణం వాడి మనసు ఊగిసలాడింది రావులమ్మ ఇచ్చిన పైకంలోంచి ఓ పదిరూపాయలు మార్చేసి కల్లు తాగేద్దావని కాని, ఎందుకో వాడికి ప్రాణం ఒప్పలేదు. డబ్బులన్నీ పదిలంగా మూటకట్టి జోలెలో పాతగుడ్డల అడుగున దాచేసాడు. ఇప్పట్లో పిల్లని ఎవరికంటా పడనియ్యొద్దని రావులమ్మకి ఓ హెచ్చరిక చేసాడు. రావులమ్మ పాకనుంచి వస్తూ దార్లో నగల్ని కూడా పాత గుడ్డలో చుట్టి అడుగున పెట్టేసాడు. అప్పుడు వెలిగింది వాడికి బుర్రలో పిల్ల తాలూకు వాళ్ళెలాగూ వెనక్కి వచ్చి వెతుకుతూ ఉంటారు. ఎప్పుడూ స్టేషన్లో పడి ఉండే తను అక్కడ కనబడకపోయేసరికి అందరి అనుమానం తన మీదకి తిరుగుతుందని. ఇంకేం ఆలోచించకుండా నగలూ, డబ్బూ కాలికి పెట్టి కట్టేసి, కుంటుకుంటూ రైల్వే స్టేషనుకి నడిచాడు.

బాలిగాడు వెళ్ళేసరికి స్టేషనంతా సందడిగా ఉంది. అసలంత పొద్దున్నే బళ్ళేం లేవు. ఆ టైంలో స్టేషను నిద్రపోతున్నట్టుంటుంది. అలాంటిదీ రోజు.. బాలిగాడికి అర్ధమైపోయింది.

స్టేషనంతా హడావిడిగా తిరుగుతున్న పోలీసుల్ని చూడగానే వాడిగుండె జారిపోయింది. తెలీకుండా ఒళ్ళంతా చెమటలు పట్టేసింది. డబ్బాని ఘల్లుఘల్లుమనిపించడం మర్చిపోయి గుటకలు మింగుతూ నిలబడిపోయాడు. పోలీసులు ఈరిగాణ్నీ ఇంకా స్టేషనులో పడుకునే మరో నలుగురైదుగురు అడుక్కునే వాళ్ళనీ వరసగా నుంచోబెట్టి ఏవేంటో అడుగుతున్నారు.

"ఒరి ఎర్రెదవా, నీకసలు బుర్రుందా?" అని తనని తనే తిట్టుకున్నాడు బాలిగాడు.

"ఒచ్చొచ్చి పోలీసోల్ల సేతుల్లో పడ్డావుగదరా" ఎవరి కంట్లో పడక ముందే నెమ్మదిగా వెనక్కి తిరిగిపోవాలనుకుంటుండగా "అల్లడుగోనండి, బాలిగాడొచ్చేసివాడు" అన్నాడొక బిచ్చగాడు పోలీసుల్తో "ఇటారా బాలిగా, ఇటూ.. ఇటూ... అయ్యగారేటో అడుగుతారంట" ఓ పొలికేక పెట్టాడు. "కొంపదీసి పిల్లని తను తీసుకెల్లడం ఈళ్ళెవరూ సూళ్ళేదుగదా" తనని తాను తమాయించుకుంటూ బాలిగాడు అటు నడిచాడు.

ఆ చోటు సరిగ్గా వెయిటింగు రూముకి ఎదురుగా ఉంది. అప్పటివరకూ అందర్ని అడిగిన ప్రశ్నలే బాలిగాణ్నీ వెయ్యడం మొదలు పెట్టారు పోలీసులు.

"నిన్న సాయంకాలం బండెళ్ళిపోయాక ఒక చిన్నపాపని చూసావా? ఆ టైంలో ఎక్కడున్నావు? రాత్రంతా ఎక్కడున్నావు?" అంటూ "లేదు, కాదు" అనే రీతిలో సమాధానాలు చెప్తున్న బాలిగాడి చూపులు మాత్రం వెయిటింగ్ రూం గుమ్మం మీద అతుక్కుపోయాయి.

అక్కడ కుర్చీలో పాతికేళ్ళలోపు ఒకావిడ కూర్చుమంది. అచ్చుగుద్దినట్టున్న పోలికల్ని బట్టి ఆవిడే పాప తల్లి అని అర్థమైపోయింది వాడికి. ఎప్పట్నుంచి ఏడుస్తుందో కానీ కంటికీ మంటికీ ఏకధార అన్నట్టుంది. ఏడ్చి ఏడ్చి కళ్ళు ఉబ్బిపోయి చిన్నవైపోయాయి. రాత్రంతా నిద్రలేనందునా, అదే పనిగా ఏడుస్తున్నందునా కళ్ళు ఎర్రగా అగ్నిపూలల్లా ఉన్నాయి. జుట్టు రేగిపోయి, బొట్టు చెరిగిపోయి పిచ్చిదాన్లా ఉంది. నిన్న ప్రయాణం కోసం కట్టుకున్న జానెడు వెడల్పు జరీచీర నలిగిపోయి కన్నీటితో తడిసిపోయింది. పక్కనే నిలబడిన సూటూ బూటులోని ఆ వ్యక్తి పాప తండ్రికాబోలు భుజం మీద తడుతూ భార్యని ఓదారుస్తున్నాడు.

వాళ్ళిద్దర్నీ వెంటనే గుర్తుపట్టాడు బాలిగాడు. నిన్న సాయంత్రం స్టేషన్లో బండికోసం ఎదురుచూస్తూ కూర్చున్న వాళ్ళ దగ్గరకి వెళ్ళి డబ్బా గలగలలాడించాడు. వాడి కాలికున్న కట్టునీ, దానిమీది ఎర్రమరకల్నీ అసహ్యంగా చూస్తూ ఒళ్ళో నిద్రపోతున్న పాపాయిని గట్టిగా హత్తుకుని "పో..పో.." అంది. అతను ఇంగ్లీషులో ఆవిడతో ఏదో అని "దున్నపోతులా ఉన్నావ్, పని చేసుకుని బతకలేవు?" అని కసిరాడు.

బాలిగాడికి ఒళ్ళు మండిపోయి వాళ్ళ చుట్టూ పేర్చుకున్న బండెడు సామాన్లూ, సూట్‌కేసుల్లోంచి ఒకటి చెక్కేద్దామా అనిపించేసింది. పొయ్యి మీద గంజి పెట్టి రాబట్టికాని, అంతపనీ చేసేవాడే

ఇప్పుడు వాళ్ళిద్దరినీ ఆ స్థితిలో చూస్తూంటే వాడికి చాలా తృప్తికలిగింది.

"ఇవతల నేను అడుగుతుంటే పరధ్యానంగా దిక్కులు చూస్తావేంట్రా కుంటెదవా?" అని లాఠీతో ఒక్కటిచ్చాడు యస్సై. వాడి భుజానికున్న బోలెను లాక్కుని కింద దిమ్మరించి లాఠీతో కెలికి చూసాడో కానిస్టేబుల్. ఆధారాలేం దొరకలేదని అందరితోబాటు వాణ్ణి వదిలేసారు. స్టేషన్లోంచి మాత్రం ఎవర్నీ బైటికి పోవద్దని ఆర్డర్ వేసారు.

డబ్బా గలగల్లాడిస్తూ రోజంతా అక్కడే తిరుగుతున్న బాలిగాడి కళ్ళుమాత్రం పాప తల్లిని వదిలి రావడంలేదు.

ఆ దుఃఖస్థితిలో ఆవిడ అమ్మకి పర్యాయపదంలా ఉంది.

ఆ మధ్యాహ్నం, సాయంత్రంకూడా ఆవిడ, తిండీ, నీరు ముట్టలేదు. ఆ ఏడుపుకి ఇక అంతంటూ ఉండదేమో అనిపించింది వాడికి. ఇంటికి పోదాం రమ్మని బతిమలాడుతున్నాడు భర్త. అక్కణ్ణుంచి కదలనని ఆవిడ హఠం పట్టింది.

వరసగా రెండు మూడు బళ్ళు రావడంతో ఏదో ట్రైయిన్‌లో ఎవరో తీసుకుపోయుంటారు. పాప అమ్మకోసం ఏడవడం భరించలేక తిరిగి ఇక్కడికే తీసుకొచ్చి వదిలేస్తారని ఆవిడ ఊహ. ఎంత విలువైనవైనా వెధవ సామాన్లు బండిలోకి ఎక్కిస్తూ ఇద్దరూ పాపనెలా మరిచిపోయారో ఆమెకి అర్ధంకావడంలేదు. బండి కదిలిన చాలాసేపటికి గానీ విషయం అంతుపట్టలేదు. గొలుసులాగి బండిని ఆపి, కంపార్ట్‌మెంట్సన్నీ వెతికి, నిరాశ చెంది టాక్సీలో వెనక్కి వచ్చారు. రాతినుంచి పోలీసులు తమ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

సాయంకాలమైంది. ఒక్కసారిగా ఎవరూ ఊహించని సంఘటన జరిగింది. స్టేషన్లోకి దూసుకొస్తున్న బండికి ఎదురుగా పాపతల్లి పరుగెత్తింది. సమయానికి ఆవిడ భర్త పట్టుకోబట్టి కానీ చక్రాలకింద ఆవిడ దేహం నుగ్గునుగ్గయ్యేదే.

రోజంతా ఆవిడని గమనిస్తూనే ఉండిపోయిన బాలిగాడికి అమ్మంటే ఏంటో అర్థమైంది. పాపని పోగొట్టుకుని ఈవిడ ఎంత కుమిలిపోతోందో, తనని పోగొట్టుకుని తన తల్లికూడా ఇంతగానూ కుమిలిపోయుంటుందని అనుకుంటే వాడికెంతో తృప్తి అనిపించింది.

పాప తల్లిలో తన తల్లిని చూస్తున్నాడు బాబిగాడు. ఇంతకాలం ద్వేషించిన 'అమ్మ ' అనే పదం ఇప్పుడు చాలా మధురంగా అనిపిస్తోంది వాడికి. తిరుగు ప్రయాణానికి పాప తండ్రి మాట్లాడిన టాక్సీ స్టేషన్ బైట ఆగి ఉంది. భార్యకు ఇంకా నచ్చచెప్పుతూనే ఉన్నాడతను.

పట్టాలకవతల వెయిటింగ్ రూం కెదురుగా తలకింద జోలెతో పడుకున్న బాలిగాడు ఒక నిర్ణయానికొచ్చి లేచి నిల్చున్నాడు.

పోలీసుల కళ్ళుకప్పి పొలాల కడ్డంపడి రావులమ్మ కల్లుపాకకి చేరుకున్నాడు. అప్పుడే దుకాణం మూసేసి అన్నీ సర్దేస్తున్న రావులమ్మ 'వచ్చేవురా బాలిగా, నువ్వటెళ్ళగానే పిల్లలేచి అమ్మ అమ్మా అని ఒకటే ఏడుపు. పాలన్నా తాగలేదనుకో. ఇవతల కొట్టునీ, అవతల పిల్లనీ సందరంచుకోలేక నల్లమందు పిసరంత మింగించి నిద్రపుచ్చేసాను. లేకపోతే అందరూ 'పిల్లెవరూ' అని అడుగుతారుగందా.. దా.. నీకు కల్లుసుక్కపోత్తాను" అంటోంది.

ఆసరికప్పుడే బాలిగాడు పాపాయిని భుజం మీదేసుకుని బైటికొస్తున్నాడు. పదిరూపాయల నోట్లనీ రావులమ్మ మీదికి విసిరేసి పరుగులంకించుకున్నాడు. నిర్ఘాంతపోయిన రావులమ్మ చెంపన చెయ్యేసుకుని నిలబడిపోయింది. చీకట్లో పొలం గట్టుమీదనుంచి రోడ్డెక్కబోయి కాలుజారి దబ్బున బోర్లాపడిపోయాడు బాలిగాడు. అసంకల్పితంగా వాడి పెదవులు 'అమ్మా' అన్నాయి. పడ్డంలో పాపాయికి దెబ్బతగలకుండా కాచుకున్నాడు.

ఆ అదురుకి పాపాయిలేచి ఏడుపు మొదలుపెట్టింది. కట్టుకట్టుకున్న పాదంలో ఎక్కడో కలుక్కుమంది. కాలుపైకి లేపడం కష్టమైంది. "ఏడవకమ్మా.. నా తల్లిగదూ... మా అమ్మగదూ.." అంటున్నాడు బాలిగాడు కలవరిస్తున్నట్టు. వాడి కళ్ళల్లో బిడ్డకోసం చావుకి సిద్ధపడిన, జీవచ్ఛవంలా మారిన తల్లిరూపం కదులుతోంది. తల్లిప్రేమకి ఈ బిడ్డ దూరం కాకూడదు. తల్లి ప్రేమను కోల్పోయిన బతుకెలాంటిదో తనకి తెలుసు.

దూరంగా స్టేషన్‌గేట్లోంచి టాక్సీ ఒకటి బైటికొస్తోంది. పాపాయిని రోడ్డుమీదికి నెట్టి, బాలిగాడు విరిగిన కాలుని ఈడ్చుకుంటూ రోడ్డుకింది తూములోకి పాకిపోయాడు. వాడి చెవులూ, మనసూ రోడ్డుమీదే కేంద్రీకృతమయ్యాయి. ఆ నిశ్శబ్ధంలో పాప ఏడుపు సన్నగా వినిపిస్తోంది.

టాక్సీ స్లో అయ్యి, క్రమంగా ఆగింది. తలుపు తీసిన చప్పుడైంది.

'పాపా' అంటూ అరిచి తల్లి పాపని కౌగిట చేర్చుకుని ఉంటుందని బాలిగాడు ఊహించుకుంటున్నాడు. ఆ తల్లి ముఖంలో బిడ్డని చూసిన ఆనందాన్ని చూడాలనుకుంటున్నాడు. అది 'తనకి సాధ్యం కాదని వాడికి తెలుసు. ఈసరికి బహుశా పాపని అక్కున చేర్చుకుని ఆ తల్లి ముద్దులు కురిపిస్తూ ఆనందబాష్పాల్లో ముంచెత్తుతూ ఉంటుంది. ఇరవై ఏళ్ళు వెనక్కిపోయి తన తల్లి సందిట తననలా ఊహించుకున్న బాలిగాడి కళ్ళవెంట ఊహ తెలిసాక మొదటిసారిగా రెండు కన్నీటి చుక్కలు జారివాడి పెదవుల్ని ఉప్పగాచేసాయి.

కొంతసేపు నిశ్శబ్దం తరువాత కారు బయలుదేరింది. కారు దూరంగా వెళ్ళిపోయి ఉంటుందని నిర్ధారించుకున్నాక అతి ప్రయాసతో పాక్కుంటూ రోడ్డుమీదికి వచ్చాడు బాలిగాడు. గంట తర్వాత అటుగా వెళ్తున్న రిక్షా వాడొకడు బాలిగాణ్ణి ఎక్కించుకుని స్టేషన్లో వదిలేసాడు.

ఒక పెద్ద బరువు దిగిపోయిన భావంతో బాలిగాడు దీపస్థంభాని కానుకుని కూర్చుని కాలు నిజంగా విరిగిందా, నొప్పిపట్టిందా అని చూసుకోవాలనుకుంటున్నాడు.

అంతలో వెక్కిళ్ళు వినిపించి అప్రత్నంగా తలెత్తి వెయిటింగ్ రూం గుమ్మం వైపు చూసాడు.

అక్కడ కుర్చీలో జీవచ్ఛవంలా పాపతల్లి. ఆ పక్కనే పాప తండ్రి. పాపని రోడ్డు మీదికి నెడుతూ పాపకి వేసిన నగలు గుర్తుకొచ్చాయి బాలిగాడికి.

*(వచ్చే నెల మరో ' కథలోంచి కథ ' )*

COMMENTS